క్లుప్తంగా

పింఛన్లు మంజూరు చేయాలి



రుద్రూర్: పోతంగల్‌లో కొత్త పింఛన్లు మంజూరు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఆసరా పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే నూతన పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బజరంగ్ హన్మండ్లు, సూదం శంకర్, గంధం హన్మండ్లు, తుకారాం, రమేశ్, వెంకట్ రావ్, కుమ్మరి హన్మండ్లు, శంకర్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు అనుమతి ఇవ్వాలి



కమ్మర్‌పల్లి: తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్లడానికి అనుమతించాలని జీపీ ఉద్యోగులు కోరారు. ఈమేరకు వారు సోమవారం కమ్మర్‌పల్లి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. జీపీ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను గ్రీన్ చానెల్‌ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు రాజేశ్వర్, వెంకటరమణ, మనోహర్, భరత్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు



ఆర్మూర్‌టౌన్: విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న పీడీఎస్‌యూ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి, పోరాటాలను ఆపలేరని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిందన్నారు. కాగ పోలీసులు పీడీఎస్‌యూ నాయకులు అసెంబ్లీకి వెళ్లకుండా అక్రమంగా ఆరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యాదర్శి కిషన్ అన్నారు. పీడీఎస్‌యూ నాయకులు సిద్ధు, వినయ్, నితిన్, నిఖిల్, సింహాద్రి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



అయిల్‌పామ్ సాగుతో లాభాలు



బాల్కొండ: ఆయిల్‌పామ్ పంటల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని ఆర్మూర్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి రుద్రవినాయక్ అన్నారు. మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో అయిల్‌పామ్ పంటలు సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు మార్పిడి చేసుకుంటు అయిల్‌పామ్ పంటలను సాగు చేయాలన్నారు. అయిల్‌పామ్ పంటల్లో అంతర్ పంటలుగా కూరగాయాలను సాగు చేసుకోవచ్చన్నారు. అయిల్ కంపెనీ మేనేజర్ కరుణాకర్ మాట్లాడుతూ.. రైతులు మొక్క దగ్గరి వరకు దున్న వద్దన్నారు. మొక్కకి సరిపడ తేమ ఉంచాలన్నారు. రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నిజామాబాద్‌నాగారం: మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీరడి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఆయనకు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి నియామకపత్రాన్ని అందజేశారు. రెండేళ్ల పాటు ఆయన పదవిలో ఉంటారని, మూడు నెలల వ్యవధిలో రాష్ట్ర, జిల్లా కమిటీలు వేయాలని వారు తెలిపారు. తనకు నియమించిన జాతీయ అధ్యక్షుడు రవికి లక్ష్మణ్ ధన్యవాదాలు తెలిపారు.

కంట్రోల్ రూం పనులు పూర్తయ్యేదెన్నడో?

- ఎస్సారెస్పీ వద్ద 2022లో శంకుస్థాపన
- ఇప్పటికీ పూర్తికాని వైనం
- పట్టించుకోని అధికారులు



ఎస్సారెస్పీ వద్ద నిలిచిన కంట్రోల్ రూం నిర్మాణ పనులు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లడ్ కంట్రోల్‌రూం పనులు అటకెక్కాయి. ఏడాది కాలంగా పనులు నిలిచిపోయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గత సంవత్సరం ఎస్సారెస్పీ డ్యాంపై స్కాడా విధానం ఏర్పాటు చేశారు. దీంతో ఉన్న ఒక్క ఫ్లడ్ కంట్రోల్ రూంలో స్కాడాకు సంబంధించిన సామగ్రి, సీసీటీవీలు, కంప్యూటర్లు పెట్టుకోవడానికి స్థలం సరిపోవడం లేదు. ఈక్రమంలో 2022 మే నెలలో సుమారు రూ. 60లక్షల నిధులతో మరో ఫ్లడ్ కంట్రోల్ రూం నిర్మాణానికి పనులు చేపట్టారు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. కంట్రోల్‌రూం స్లాబ్ వేసి వదిలేశారు. ఇప్పటి వరకు ఒక్క ఇటుక పడలేదు. పడుతుందో లేదో కూడ అధికారులకే తెలియని పరిస్థితి ఉంది.

బిల్లులు రాకపోవడంతో..

నత్తనడకన పనులు సాగుతున్నా కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వలేని పరిస్థితిలో అధికారుల ఉన్నారు. కారణం సరైన సమయంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడమే. ప్రతి సంవత్సరం జూన్ నుంచి ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్ట్‌లోకి వరదలు వచ్చి చేరుతాయి. అక్టోబర్ చివరి వరకు కూడ వరద నీరు కొనసాగుతుంది. అప్పటి వరకు నిత్యం ఉన్నత అధికారుల రాకపోకలు సాగుతునే ఉంటాయి. ఉన్నత అధికారులు వస్తే కుర్చీ వేసి కూర్చోబెట్టే స్థలం కూడా కంట్రోల్ రూంలో లేదు. పాలకులు స్పందించి సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలి. అయితేనే అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటూ పనులను వేగవంతం చేసే అవకాశం ఉంది. వచ్చే ఫ్లడ్ సీజన్ వరకు కూడ కంట్రోల్ రూం పూర్తి కాకపోతే తీవ్ర ఇబ్బంది ఉంటుంది. అధికారులు, పాలకులు స్పందించి బిల్లులు చెల్లించడంతోపాటు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీజన్ వరకు పూర్తి చేస్తాం..

ఎస్సారెస్పీ డ్యాం వద్ద నిర్మిస్తున్న ఫ్లడ్ కంట్రోల్‌రూం నిర్మాణ పనులు వచ్చే ఫ్లడ్ సీజన్ వరకు పూర్తి చేస్తాం. అందుకు అనుగుణంగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించాం. సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

రెంజల్(బోధన్): వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆధునిక పద్ధతులను పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి సూచించారు. రెంజల్ విండో పరిధిలోని బోర్గాం గ్రామంలో సోమవారం ఆయన 250 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల ద్వార రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతీ సొసైటీకి రాయితీపై మార్చిలో డ్రోన్‌లను కొనుగోలు చేసి ఎకరాకు రూ.150 చొప్పున ధర నిర్ణయించి మందుల పిచికారికి వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెంజల్ మండలానికి త్వరలో సహకార బ్యాంకు మంజూరుకు ప్రయత్నిస్తానన్నారు. సాటాపూర్ కేంద్రంగా బ్యాంకును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, విండో ఇన్‌చార్జ్ చైర్మన్ మొహియొద్దిన్, మొబిన్‌ఖాన్, దనుంజయ్, డైరెక్టర్‌లు నారాయణ, సాయిలు, ఖదీర్‌పాష, చంద్రకళ, సావిత్రి, రైతులు భూమారెడ్డి, ఫిరోజోద్దిన్, కాంగ్రెస్ నాయకులు నితిన్, రాజు, పోచయ్య, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరి పాఠశాలలో ఏబీవీపీ ఇందూర్ విభాగ్ అభ్యాసవర్గా సమావేశాలు సోమవారం కొనసాగాయి. ఈసందర్భంగా సంఘ నాయకులు ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందూరు విభాగ్ సంఘటన మంత్రి రాజశేఖర్, కనీవ్వనర్ శశి, జాతీయ కార్యవర్గ సభ్యుడు శివకుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్ మోహన్‌గౌడ్, ఇందూర్ జిల్లా ప్రముఖ్ ఈశ్వర్, కామారెడ్డి జిల్లా ప్రముఖ గిరి, నగర అధ్యక్షుడు గొడుగు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవిగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, సిద్ధులగుట్ట సేవాసమితి సభ్యులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్నస్వామికి బోనాలు



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామంలో మల్లన్నస్వామికి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు బోనాలనూ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్నస్వామి గొల్లకేతమ్మ, బలిజ మాండలమ్మ కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి దేవన్న, చిన్నయ్య, సుబ్బు, మహేష్, సాగర్, రాజు, మల్లేష్, ముత్యం, నడ్పన్న, దిలీప్, ప్రశాంత్, సుమన్, దీక్ష స్వాములు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంతమల్లన్న జాతర



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో సోమవారం సంతమల్లన్న జాతర ఘనంగా జరిగింది. అంక్సాపూర్ గ్రామస్తులతో పాటు, వివిధ మండలాల ప్రజలు భారీగా తరలివచ్చి సంతమల్లన్నకు మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు వీడీసీ ఆధ్వర్యంలో సంతమల్లన్నకు, మాండలమ్మ, గొల్లకేతమ్మతో పూజారులు కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో శివాలయ పునర్నిర్మాణం కోసం సోమవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామం నుంచి భక్తులు కలశలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. మాజీ ఎంపీపీ జక్క రాజేశ్వర్, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దిగివచ్చిన ఇసుక ధరలు

- గతంలో ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు
- ప్రస్తుతం రూ.3వేల లోపే ..



మోర్తాడ్ మండలంలో నిల్వ ఉంచిన పెద్దవాగు ఇసుక

మోర్తాడ్(బాల్కొండ) : ఇసుక ధర పడిపోవడంతో ఇళ్లను నిర్మించుకునేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకకు గతంలో రూ.5వేల వరకు వసూలు చేసిన వ్యాపారులు ఇప్పుడు రూ.3వేల కంటే ఇంకా తక్కువ ధరకు విక్రయిస్తుండటం విశేషం. పెద్దవాగు నుంచి ఇసుకను తరలించడానికి అధికారులు అనుమతులు ఇచ్చినా ఇవ్వకపోయినా గ్రామాభివృద్ధి కమిటీలు వేలంపాటలు నిర్వహించి ఇసుకను తవ్వుకోవడానికి అనధికార అనుమతులు ఇస్తున్నాయి. ఇసుక రవాణా అక్రమమో, సక్రమమో కాని ధరలు తగ్గిపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

సుంకెట్, పాలెం, ధర్మోరా, శెట్‌పల్లి, గాండ్లపేట్, మోర్తాడ్ శివారులలో ఉన్న పెద్దవాగు నుంచి ఇసుకను తరలించడం ఆనవాయితీగా వస్తుంది. వ్యాపారులు గ్రామాభివృద్ధి కమిటీలతో ఎలాంటి ఒప్పందం చేసుకున్నా ఇళ్లు నిర్మించుకునేవారికి మాత్రం తక్కువ ధరకే ఇసుకను విక్రయించాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డి సూచించారు. ఫలితంగా కమ్మర్‌పల్లిలో రూ.2,600ల నుంచి రూ.3వేల వరకు, మోర్తాడ్‌లో రూ.2,400లోపు ఇసుకను విక్రయిస్తున్నారు. సుంకెట్ పెద్దవాగులో ఇసుక తవ్వకాలకు నియంత్రణ చేస్తే మరింత ధర తగ్గే అవకాశం ఉంది. ఇక్కడ గ్రామాభివృద్ధి కమిటీ ఒక్కో ట్రిప్పుకు రూ.1,800ల వరకు వసూలు చేస్తుంది. అధికారులకు మామూళ్ల పేరిట ఒక్కో ట్రిప్పుకు రూ.500లు అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో ఇసుకట్రిప్పును రూ.5వేల నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. వీడీసీ వసూళ్లు, వ్యాపారుల పెత్తనం అదుపు చేస్తే ధర మరింత తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పరిస్థితి మారింది..



ఇసుక రవాణా, విక్రయం విషయంలో స్థానిక పార్టీ అగ్రనేత చొరవ తీసుకోవడంతో ఇసుక ధర తగ్గిపోయింది. గతంలో అడ్వాన్సులు ఇచ్చి ఇసుక కోసం వేచి చూసేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి మారింది. ఇసుక ధర తగ్గిపోవడంతో అందరికి లాభం కలుగుతుంది.

– బూత్‌పురం మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్

ఎంతో మందికి మేలు...



ఇసుక ధర తగ్గిపోవడంతో ఇళ్లు నిర్మించుకునేవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఒక్కో ట్రిప్పు ధర సగానికి పడిపోవడంతో ఇళ్లు నిర్మించుకునేవారికి ఖర్చులు కలిసి వస్తున్నాయి. గతంలో వ్యాపారులు చెప్పిందే వేదంగా మారింది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.

– ముత్యాల రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మోర్తాడ్

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



నిజామాబాద్‌నాగారం: వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, నిత్యం క్రీడల్లో సాధన చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో గత మూడురోజులుగా కొనసాగుతున్న గోర్ బంజారా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ సోమవారం ముగిసింది. కార్యక్రమానికి తాహెర్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రకాష్, గంగారం, ప్రతాప్‌సింగ్, దేవిసింగ్ ఉన్నారు.

సంక్షిప్తం

ఘనంగా విజయ్ దివస్



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని లిల్లిపుట్ పాఠశాలలో సోమవారం విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు ఆర్మీ జవానుల వేషధారణలో చేసిన విన్యాసాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చాయ్ దినోత్సవం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సోమవారం అంతర్జాతీయ చాయ్ దినోత్సవాన్ని వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నిర్వహించారు. ఈసందర్భంగా వారంతా కలిసి చాయ్ తాగారు. సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, లయన్స్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్, కర్తన్ దినేష్, సంతని విజయ్, సంజయ్, సునీల్, విశ్వనాథ్ రంగ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గల రాంమందిర్ ఉన్నత పాఠశాలకు సోమవారం సత్య ఎలక్ట్రికల్స్ సాయి కృష్ణ రూ. 45వేల విలువగల కంప్యూటర్‌ను అందజేశారు. అనంతరం హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయులు దాతను సన్మానించారు..

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వన్నెల్‌కే గ్రామంలో డీ76/1 నిజాంసాగర్ కాలువపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలని నిలిపి వేయాలని గ్రామస్థుడు బండి రవీందర్ కోరారు. ఈమేరకు ఆయన సోమవారం జిల్లా పంచాయతీ అధికారి, స్థానిక మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

ఏబీవీపీ బోధన్ అధ్యక్షుడిగా శ్రీరామ్



బోధన్ టౌన్(బోధన్): ఏబీవీపీ బోధన్ పట్టణ అధ్యక్షుడిగా అడ్లూరి శ్రీరామ్ ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఏబీవీపీ ఇందూర్ విభాగ్ అభ్యాసవర్గ సమావేశాల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేష్, విభాగ్ సంఘటన మంత్రి రాజు, జిల్లా ప్రముఖ్ తలండే ఈశ్వర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో గేడెల కాపరి ముక్క చిన్నసాయిలు ప్రమాదవశాత్తు ఇటీవల మృతిచెందాడు. నిరుపేదలైన బాధిత కుటుంబానికి సోమవారం స్థానికులు 50 కేజీల బియ్యన్ని, అంత్యక్రియలకు విరాళాలను అందజేశారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన మూడు అదనపు తరగతి గదులను సోమవారం ఎస్ఎంసీ చైర్మన్ రామకృష్ణ ప్రారంభించారు.శైవ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



బాల్కొండ: ముప్కాల్ చెరువులో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే కాపాడాలని ముప్కాల్ పరిరక్షణసమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీ భవనాన్ని ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలన్నారు. సమితి అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌థామస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వేల్పూర్: మండలంలోని పోచంపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన సుమారు అర ఎకరం ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు వారు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై, కబ్జాదారుడిపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బిజ్జు దత్తాద్రి



ఆర్మూర్‌టౌన్: పట్టణానికి చెందిన జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యాక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

బీఎల్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్

నిజామాబాద్ సిటీ: తెలంగాణ రాష్ట్ర బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా దండి వెంకట్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్దిరాములు, ఉపాధ్యక్షులుగా సబ్బునిలత, ఆంజనేయులు, శ్రీశైలం, కార్యదర్శులుగా ఎంఎం గౌడ్, వడ్ల సాయికృష్ణ, సహాయ కార్యదర్శిగా నాగారపు ఎల్లయ్య, కోశాధికారిగా సునీల్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా జగదీష్, గంగాశంకర్, రాజేందర్, సయ్యద్, గంగామణి, చాట్ల పోశవ్వ, కళా, మహిముద్, అరుణ, అజయ్, శ్రీహరి, రాజు ఎన్నికయ్యారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మిస్‌యూ (తెలుగు) - 10.45; పని (తెలుగు) -1.35; మిస్‌యూ - 4.40 7.30 10.20
స్క్రీన్-2	పుష్ప-2 (తెలుగు) - 10.15 2.20 6.25 10.30
స్క్రీన్-3	పుష్ప-2 (తెలుగు) -12.20 4.25 8.30
స్క్రీన్-4	పుష్ప-2 (తెలుగు) -1.20 5.25 9.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప - 2 (తెలుగు) - 1.30,7.00
స్క్రీన్-2	మిస్‌యూ (తెలుగు) - 10.40 , 1.20,7.50,10.30
స్క్రీన్-3	పుష్ప -2(తెలుగు)-11.0,4.30,10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10,10.15
స్క్రీన్-2	ఫియర్(తెలుగు)-11.45; మిస్‌యూ(తెలుగు)-2.20; పుష్ప-2 (తెలుగు)-5.10 9.15
స్క్రీన్-3	ప్రణయ గోదారి(తెలుగు)-11.10; పుష్ప-2(హిందీ)- 2.20 6.25 10.30
స్క్రీన్ -4	పుష్ప-2(హిందీ)-10.00; పని(తెలుగు) -2.05; మిస్‌యూ-5.10 10.35; ఫియర్(తెలుగు)- 10.35
లలితామహల్	మిస్‌యూ (తెలుగు)
దేవి	పని(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,000	వెండి(కిలో)	96,500
22 క్యారెట్స్	72,890		

– నిజామాబాద్ బిజినెస్